క్లుప్తంగా

బెజ్జూర్ ఎస్సైగా ప్రవీణ్


ఎస్సై ప్రవీణ్

బెజ్జూర్: బెజ్జూర్ ఎస్సైగా కె.ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న విక్రమ్‌ను ఆసిఫాబాద్ ఎస్పీకి అటాచ్ చేశారు. 2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్ లింగాపూర్ నుంచి బదిలీపై వస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల నరికివేత కార్యక్రమాలు ఉన్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. పట్టణంలోని కౌసర్‌నగర్, మార్కెట్ ఏరియా, సంజీవయ్యకాలనీ, కాపువాడ ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం'

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టు సురేశ్ కుటుంబానికి అండగా ఉంటామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ తెలిపారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టు సురేశ్ కుటుంబ సభ్యులకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితునికి సోమవారం సెల్‌ఫోన్‌ను పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ అప్పగించారు. మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన ఇగురపు ధనరాజ్ గత కొన్నిరోజుల క్రితం సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని సీఈఐఆర్ పోర్టల్ ఫిర్యాదు చేయడంతో ట్రాక్ చేసి సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై దీకొండ రమేశ్ పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఝురి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతివారంలో మూడు సార్లు గుడ్లు పెట్టాలని, మెనూ తప్పక పాటించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. న్యాస్‌కు సంబంధించి మాక్, వీక్లీ టెస్టులు విధిగా నిర్వహించాలన్నారు. డిసెంబర్‌లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు న్యాస్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తుడుందెబ్బ మహాసభ విజయవంతం చేయాలి

బెజ్జూర్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మహాసభలను విజయవంతం చేయాలని ఆదివాసీ కోలవార్ సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోల్కు వెంకటేశ్ కోరారు. తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల మహాసభలు ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన తుడుందెబ్బ జిల్లా కమిటీలతో పాటు డివిజన్, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

కోయ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

కౌటాల: గోండ్వానా ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం కౌటాల మండల నూతన కమిటీని సోమవారం స్థానిక కుమురం భీం భవనంలో ఎన్నుకున్నారు. సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా నైతం బాజీరావు, అధ్యక్షులుగా సిడం అశోక్, ఉపాధ్యక్షులుగా సిడం సురేశ్, ప్రధాన కార్యదర్శిగా తలండి దిలీప్, కార్యదర్శులుగా మడావి సంతోష్, కుడ్మెత ఆత్మారం, సభ్యులుగా వసంత్, సంతోష్, దిలీప్, మధుకర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పాల్గొన్నారు.

సర్వే పేరిట విధులకు ఎగనామం

- విద్యాధికారుల పర్యవేక్షణ కరువు
- నష్టపోతున్న విద్యార్థులు


గూడెం ప్రాథమిక పాఠశాల


బాబాసాగర్‌లో సర్వే చేస్తున్న ఉపాధ్యాయురాలు

చింతలమానెపల్లి: సమగ్ర కుటుంబ సర్వే విద్యార్థుల చదువుకు ఆటంకంలా మారుతోంది. మండలంలోని ఆయా గ్రామాలలో మొత్తం 76 మంది ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నారు. వీరిలో 55 మంది ఉపాధ్యాయులు కాగా మిగితా వారు వివిధ శాఖల ఉద్యోగులు ఉన్నారు. వీరికి తగిన సూచనలు అందించేందుకు 8 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారు. మండల విద్యాధికారి, ఎంపీడీవో, తహసీల్దార్ పర్యవేక్షణలో సర్వే నిర్వహిస్తున్నారు.

సర్వేలో నిబంధనలు..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వే కోసం పలు నిబంధనలు రూపొందించింది. విద్యాశాఖలోని ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సర్వే నిర్వహిస్తున్నారు. ఈమేరకు పాఠశాలల సమయాల్లో మార్పులు చేసింది. ఉదయం ఒంటిపూట పాఠశాలలు నిర్వహించేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఉదయం పూట నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని సూచనలు చేశారు. మధ్యాహ్నం 12.15 గంటలకు భోజనం అనంతరం ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొనాలి. ఉదయం పూట తరగతుల అనంతరం ఉపాధ్యాయులు సర్వే చేయాల్సి ఉంది.

నిబంధనలు ఉల్లంఘించి..

మధ్యాహ్నం సర్వేలో పాల్గొనాల్సిన ఉపాధ్యాయులు సర్వే కోసం నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని గూడెం పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని పలువురు ఉపాధ్యాయులకు చింతలమానెపల్లి మండల కేంద్రంలో సర్వే విధులు కేటాయించారు. మరికొందరికి రవీంద్రనగర్, ఇతర ప్రాంతాలలో విధులు కేటాయించారు. ఈక్రమంలో పని ఒత్తిడి తగ్గించుకోవడానికి ఉపాధ్యాయులు పాఠశాల విధులకు ఎగనామం పెడుతున్నారు. గూడెం కాంప్లెక్స్ పరిధిలో దిందా, కేతిని, శివపెల్లి, గూడెం, రుద్రాపూర్, ఖర్జెల్లి, కోయపెల్లి, బూరుగూడ గ్రామాలలో పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు పాఠశాలల్లో విధులకు హాజరు కాకుండా సర్వేలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే రోజుకు ఒకరు వంతుల వారీగా మాత్రమే విధుల్లో ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్న భోజనం సమయానికి పాఠశాలలో రాజేందర్ అనే ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడం గమనార్హం. మిగితా ఉపాధ్యాయుల విషయమై ప్రశ్నించగా తహసీల్దార్ ఆదేశాల మేరకే ఉదయం నుంచి సర్వే నిర్వహిస్తున్నామని తెలపడం గమనార్హం. మండలంలోని బాబాసాగర్ గ్రామంలో అడెపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు ఉదయం నుంచే సర్వే నిర్వహిస్తుండగా పలువురు ప్రశ్నించడంతో మండల విద్యాధికారి ఆదేశాలతో ఉదయం నుంచి సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులకు నష్టం..

గత ఏడాది వరకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులకు గురయ్యారు. ఇటీవల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ అయినప్పటికీ సర్వేల పేరుతో పాఠశాలల్లో విధులకు ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. చదువుకునే విద్యార్థుల పాలిట ఉపాధ్యాయుల తీరు విమర్శలకు కారణమవుతోంది. ఈవిషయంపై మండల విద్యాధికారి జయరాజ్‌ను వివరణ కోరగా సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజనం తర్వాతే పాల్గొనాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు పరిశీలించాల్సిన బాధ్యత పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై ఉందని తెలిపారు.

పౌష్టికాహారం అందేదెప్పుడు..?

- సిబ్బంది లేక అంగన్‌వాడీ కేంద్రం మూసివేత
- లబ్ధిదారులకు సక్రమంగా అందని పౌష్టికాహారం


మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

తిర్యాణి: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో సిబ్బంది లేక అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పూర్తిగా కరువైంది. కాగా మండలంలోని తలండి గ్రామపంచాయతీ పరిధిలోని అమీన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయా లేకపోవడంతో ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోవడం లేదు.

దాదాపు గత పదేళ్ల క్రితం అమీన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే టీచరు పదోన్నతిపై బదిలీ అయ్యింది. అప్పటి నుంచి సెంటర్ నిర్వహణను ఆయా చూసుకునేది. అయితే ఆరేళ్ల క్రితం ఆయా మృతిచెందగా అప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోలేదు. దీంతో ఐసీడీఎస్ సిబ్బంది పక్కన ఉన్న తలండి అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో పౌష్టికాహారం కోసం ప్రతినెలా తలండి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు. కాగా తలండి, అమీన్‌గూడ గ్రామాల వద్ద వాగు ఉండటంతో గర్భిణీలు, బాలింతలు రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఇద్దరు గర్భిణీలు, ఇద్దరు బాలింతలు, 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు 21 మంది, మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులు 13 మంది ఉన్నారు.

వచ్చే నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తాం

అమీన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో చాలా ఏళ్ల నుంచి టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. గత ఆరేళ్ల వరకు అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ ఆయా చేపట్టింది. కానీ ఆమె మరణించడంతో సెంటర్‌లో ఆయా, టీచర్ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. త్వరలో వెలువడే నోటిఫికేషన్‌లో ఆయా, టీచర్ పోస్టులను భర్తీ చేస్తాం.

– యశోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

బెజ్జూర్: గూడెం చెక్‌పోస్టు వద్ద డ్యూటీ చేస్తున్న ఏఎస్సై సూర్యదాస్, కానిస్టేబుల్ వెంకటేశ్, నరేశ్‌లు తమ సొంత డబ్బులతో గూడెం గ్రామానికి చెందిన వృద్ధులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పోలీసులు సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పలువురు అభినందించారు.

కాగజ్‌నగర్‌రూరల్: శ్రీచైతన్య వికలాంగుల సంఘంలోని వికలాంగులకు సోమవారం ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే


ధనోరాలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. సోమవారం వరకు 7530 కుటుంబా లకు సర్వే పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు. 31 గ్రామ పంచాయతీల్లో మొత్తం 10,037 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించగా.. సోమవారం ఒక్కరోజే 832 కుటుంబాల సర్వే కొనసాగింది. సర్వేలో ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్, ఇతర సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు.

'మత మార్పిడికి గురి కావొద్దు'


జిల్లా కేంద్రంలో ప్రారంభమైన రథయాత్ర

ఆసిఫాబాద్: హిందువులు మతమార్పిడికి గురి కావొద్దని ధర్మజాగరణ సమితి మండల ఇన్‌చార్జి ఉప్పల సంజీవ్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో రథయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల సంజీవ్ మాట్లాడుతూ మత మార్పిడి జరగకూడదన్నారు. గత 15 రోజులుగా రథయాత్ర రాష్ట్రంలోని జిల్లాల్లో కొనసాగుతుందన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో రథయాత్ర నిర్వహిస్తూ హిందువులను చైతన్య పరుస్తామన్నారు. హిందూ ధర్మం విశిష్టత, సనాతన సాంప్రదాయంపై వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొలిప్యాక వేణుగోపాల్, మదునయ్య, శిశుమందిర్ హెచ్ఎం గుండేటి కోటేశ్వర్ రావు, అన్నాజి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, ఇతర సమస్యలను త్వరగా పరిష్కరించాలని జీపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్యలు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ సృజనను సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు జీవో ప్రకారం కనీస వేతనంగా రూ. 26వేలు చెల్లించాలని, ప్రతినెలా ప్రభుత్వ గ్రాంట్ ద్వారా 1వ తేదీన వేతనాలు విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెరిక శ్రీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని భారతీ విద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ దుర్గం గోపాల్ అన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు కాగజ్‌నగర్‌లో నిర్వహించిన నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో వారిని సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సందీప్, గులాబ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యువత ర్యాష్ డ్రైవింగ్


కాగజ్‌నగర్‌లో అతివేగంగా వెళ్లి చెట్టును ఢీ కొన్న బైక్ (ఫైల్)

కౌటాల: జిల్లాలో పలువురు యువకులు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అతివేగంగా వాహనాలను నడుపుతూ నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. సాయంత్రం వేళ పోలీసుల నిఘా ఉంటున్నప్పటికీ మధ్యాహ్నం, రాత్రయితే వీరు జోష్ పెంచుతున్నారు. ఎక్కువ శబ్దాలు వచ్చే వాహనాలతో విపరీతమైన వేగంతో వెళ్తున్న వీరి సరదా కొన్నిసార్లు ఎదుటి వారి ప్రాణాలమీదకి తెస్తుంది. జిల్లాలో ఇటీవల పలువురు వేగంగా వాహనాలు నడిపి మృత్యువాత పడ్డారు.

పట్టని నిబంధనలు..

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రోడ్లపై వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు కౌటాల, రెబ్బెన, వాంకిడి, సిర్పూర్(టి), దహెగాం, చింతలమానెపల్లి మండల కేంద్రాల్లో యువత వేగంగా బైక్‌లు నడుపుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇంటర్, పదో తరగతి చదివే మైనర్ పిల్లలు సైతం బైక్‌పై ముగ్గురు, నలుగురు వెళ్తూ, పెద్ద శబ్దాలతో చక్కర్లు కొడుతున్నారు. హెల్మెట్ ధరించకుండా వేగంగా ప్రయాణిస్తుండడంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్..

చేతి భుజం, తలమధ్యలో సెల్‌ఫోన్ పెట్టుకొని వాహనం నడపడం.. బ్లూటూత్‌లో మాట్లాడుతూ వెనుక హారన్ కొట్టినా పట్టించుకోకుండా అడ్డదిడ్డంగా పోవడం వాహనదారులకు అలవాటుగా మారింది. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని పోలీసులు చెబుతున్నా.. పలుమార్లు జరిమానాలు విధిస్తున్నా కొందరి తీరు మారడం లేదు. ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడాన్ని పోలీస్ అధికారులు డేంజర్ డ్రైవింగ్‌గా పరిగణిస్తున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడానికి హెల్మెట్ పక్కన పెట్టాలి. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు రూ.1,000, హెల్మెట్ వాడనందుకు రూ.135 జరిమానా విధిస్తున్నారు.

నిఘా ఏది..?

డ్రైవింగ్ లైసెన్సులు లేకుండానే రోడ్డెక్కుతూ, నిబంధనలు అతిక్రమించి ఇష్టారాజ్యంగా కొందరు వాహనాలు నడుపుతున్నారు. రోడ్లపై కొందరు యువకులు బైక్‌లను ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై పోలీసులు చర్యలు తీసుకుంటే వారిలో మార్పు వచ్చే అవకాశాలున్నాయంటున్నారు. కాగా ఇంటి పనుల కోసం కొందరు తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. కాగా ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసులు నిఘా పెట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

నియంత్రణకు చర్యలు



వాహనదారుల్లో చాలా మంది బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారు. వాహనం నడిపే ప్రతీ వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. యువత ర్యాష్ డ్రైవింగ్ నియంత్రించేందుకు చర్యలు చేపడతాం. 18 ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలి. రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి నిఘా పెట్టి వేగంగా నడిపే ద్విచక్రవాహనదారుల పై చర్యలు తీసుకుంటాం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ కొందరు, బ్లూటూత్ వాడుతూ మరికొందరు వాహనాలు నడుపుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం.

– మధుకర్, ఎస్సై, కౌటాల

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. సోమవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి వంటలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తెలిపారు. మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయులు శ్రద్ధ ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో గావుడే హన్మంతు ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం అల్పాహారాన్ని మాజీ సర్పంచ్ బొమ్మెళ్ల పద్మకిషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌తో ఉజ్వల భవిష్యత్

ఆదిలాబాద్: నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటేనే క్రికెట్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం క్రికెటర్లకు జెర్సీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ క్రీడకు దేశంలో ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలంటే ఎంతోమంది క్రికెటర్లతో పోటీ పడాల్సి ఉంటుందన్నారు. ఎన్నో నూతన మెలుకువలను పెంపొందించుకొని, నిత్యం సాధన చేస్తేనే క్రికెట్లో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రికెటర్లు ఉన్నారని, వారు సరైన శిక్షకుల పర్యవేక్షణలో శిక్షణ పొందితే గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. సీనియర్ క్రికెటర్లు పాల్గొన్నారు.